క్లుప్తంగా

గురు పౌర్ణమి వేడుకలకు అంకుర్పారణ


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెదపూడి: వ్యాస పూర్ణిమ సందర్భంగా జి.మామిడాడ గ్రామంలోని అభయ గణపతి ఆలయంలో వేంచేసి ఉన్న షిర్డీ సాయిబాబా వారికి గురు పౌర్ణమి వేడుకల అంకురార్పణ పూజలు బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఐ.మూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ద్వారంపూడి వెంకటరెడ్డి ఈ పూజలు ప్రారంభించారు. తెల్ల వారుజామున బాబా వారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ ద్వారంపూడి యువరాజారెడ్డి, అభయ గణపతి భజన బృందం ప్రతినిధి మేడపాటి సాయిబాబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


పందలపాకలో లబ్ధిదారులకు కిట్లు అందిస్తున్న సర్పంచ్

బిక్కవోలు: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ సబ్బారపు పద్మావతి అన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆమె పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, వార్డు సభ్యురాలు యామాల చిన్నమ్మ, మాజీ ఎంపీటీసీలు సబ్బెళ్ల విజయభాస్కర్‌రెడ్డి, సబ్బారపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరంపై దాడి


సారా స్థావరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రంగంపేట: సారా తయారు చేస్తున్న స్థావరంపై స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బృందం బుధవారం దాడి చేసింది. ఇందులో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమసోశర్ ఆదేశాల మేరకు ఈ దాడి చేశారు. కానేడు గ్రామంలో సారా తయారు చేస్తున్న బల్లి సత్తిబాబును అరెస్టు చేసి, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్‌ఈబీ ఎస్సై జి.అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజానగరం: కలవచర్ల, వెలుగుబంద, రాజానగరంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేవేస్తారు. ఈ కారణంగా పైవిద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని కలవచర్ల, సీతారామపురం, వెలుగుబంద, జగనన్న కాలనీ, రాజానగరంలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆ సమయంలో వ్యవసాయ బోర్లకు కూడా విద్యుత్ ఉండదన్నారు.

రేపటి నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ఏపీటీటీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనున్నాయి. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి బుధవారం ఈ విషయాన్ని ప్రకటనలో తెలిపారు. ఏవీ అప్పారావు రోడ్డులోని వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలో గల ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో పోటీలు జరుగుతాయన్నారు. ఏపీటీటీఏ ఉపాధ్యక్షుడు భాస్కర రామ్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు వివిధ నగరాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. క్రీడాకారులు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి ర్యాంకింగ్ ఇచ్చి జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు పతకాలు కూడా ప్రదానం చేస్తామని తెలిపారు.

గోదారి వరద .. రైతులకు దడ..

- కొట్టుకుపోతున్న లంక భూములు
- ఏటా వందల ఎకరాలు కనుమరుగు
- ఆందోళనలో రైతులు


వంగలపూడి - రామచంద్రపురం మధ్యలో గోదావరి వరద కోతకు గురైన లంకభూమి

సీతానగరం: గోదావరి వరదలు వస్తున్నాయంటే మండల రైతులు కలవరపడుతున్నారు. పంటలు పండించే లంకభూమి కోతకు గురై కొట్టుకుపోవడమే దీనికి కారణం. గోదావరి పరివాహక ప్రాంతమైన సీతానగరం మండల గ్రామాలకు చెందిన లంక భూములు ఏటా గోదావరి వరదకు కోతకు గురవుతున్నాయి. ముఖ్యంగా ముగ్గళ్ల, రఘుదేవపురం, ములకల్లంక, మునికూడలి, కాటవరం, పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి గ్రామాలలో వందల ఎకరాల లంక భూములకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉధృతంగా వచ్చిన వరద.. లంక భూములను గోదావరిలో కలిపేస్తోంది. దీంతో సాగు చేయడానికి భూమి లేకపోవడంతో ఏమి చేయాలో తెలియని స్థితిలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది వంద ఎకరాలకు నష్టం

గత ఏడాది గోదావరికి వచ్చిన వరదకు సుమారు వంద ఎకరాలకు పైగా లంక భూములు కోతకు గురయ్యాయి. ఈ కోత విషయాన్ని ఎనిమిదేళ్ల క్రితమే ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారుల దృష్టికి పలు గ్రామాల రైతులు తీసుకువెళ్లారు. అయితే వరదకు గురైన లంకభూములకు తామేమీ చేయలేమని, గోదావరి వరద వల్ల ఏటిగట్టుకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామే తప్ప, కోతకు గురైన లంకభూములకు నష్టపరిహారం కానీ, వరద నుంచి కాపాడడానికి ఎటువంటి చర్యలు తీసుకోవలేమని అధికారులు తెలిపారు.

కోత బారిన..

పురుషోత్తపట్నంలోని పాత ఫెర్రీ రేవు వద్ద రెండేళ్ల క్రితం కోత కారణంగా వనదుర్గ ఆలయం నదీగర్భంలో కలిసిపోయింది. రామచంద్రపురం, వంగలపూడి మధ్య లంకభూమిలో మూడు విద్యుత్ మోటార్లు వరదలో కొట్టుకుపోయాయి. వరదతో సారవంతమైన లంకభూములు కోతకు గురవుతున్నాయి. లంకభూములు కోతకు గురికాకుండా రైతులే తగిన చర్యలు తీసుకోవాలి. లంకభూమి గట్టున పైనుంచి గోదావరి అంచు వరకూ రెల్లు దుబ్బులను పెంచితే గోదావరి వరద నుంచి లంక భూములను కోతకు గురవ్వకుండా కాపాడవచ్చు. అలాగే లంకభూములపై గోదావరి వరద మట్టి వేసే అవకాశాన్ని కూడా రెల్లు దుబ్బులు కలగజేస్తాయి.

ఆదుకోవాలి

గోదావరి వరదతో ఎకరం



న్నర లంకభూమి కోతకు గురైంది. మోటారు కొట్టుకుపోయింది. వరద వచ్చిందంటే భయపడుతున్నాం. ఏటా ఇదే సమస్య ఎదురవుతోంది. లంకభూములు కోతకు గురవ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదా మమ్మల్ని ఆర్థికంగా ఆదుకోవాలి.

– తిర్నాతి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, వంగలపూడి, రైతు

రెల్లు దుబ్బులు పెంచాలి



గోదావరి వరదతో లంక భూములు కోతకు గురవుతున్నాయి. దీనితో రైతులు నష్టపోతున్నారు. లంకభూములు కోతకు గురవ్వకుండా ఉండాలంటే భూమి అంచుల నుంచి కింద వరకూ రెల్లుదుబ్బులు నాటి పెంచాలి. దీని ద్వారా కోతకు గురవ్వకుండా అరికట్టవచ్చు. అలాగే సారవంతమైన ఒండ్రు మట్టి వేసే అవకాశం ఉంది.

– ఎ.శివప్రసాద్, ఏజీఎల్‌బీ ఏఈ

హైందవ చైతన్యం తీసుకురావడమే లక్ష్యం

గోకవరం : మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే ప్రథమ లక్ష్యంగా కృషి చేస్తున్నామని విశ్వ హిందూ ధర్మం పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దేవిచౌక్ కనక దుర్గమ్మ ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంగారు వరలక్ష్మి కానుక రిజిస్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 14 వరకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 11న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 90 మంది మహిళలకు ఒక గ్రాము బంగారు వరలక్ష్మి డాలర్ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు.

మైనర్లు వాహనాలను నడపడం నేరం

మధురపూడి: మైనర్లు వాహనాలు నడపడం నేరమని కోరుకొండ సీఐఅడపా నాగ మురళీ అన్నారు. వాహనాలను డ్రైవింగ్ చేస్తు పట్టుబడిన 14 మంది మైనర్లకు బుధవారం సాయంత్రం కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మైనర్లు మోటార్ సైకిళ్ల నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వాహన చోదకులు తమ రికార్డులను వెంట తెచ్చుకోవాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపితే చట్ట ప్రకారం వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై డి.ఆనంద కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం


రాజానగరం హైస్కూల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ


గాడాల హైస్కూల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు


కూనవరంలో కిట్లను అందజేస్తున్న నాయకులు

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలలో స్టూడెంట్ కిట్లను బుధవారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకే పంపించి, చదివించాలని కోరారు. అలాగే రాజానగరం, సూర్యారావుపేటలలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, ఎన్‌డీఏ కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6,112 మంది విద్యార్థులకు ఎంఈఓలు కుశలవదొర, సుజాతల ఆధ్వర్యంలో బుధవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. గాడాల హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలా జ్యోతికుమారి మాట్లాడుతూ స్టూడెంట్ కిట్లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బూరుగుపూడి హైస్కూల్లో హెచ్ఎం సాయిప్రసాద్ మాట్లాడుతూ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూనవరం పాఠశాలలో..

సీతానగరం: కూనవరం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు వైఎస్సార్ సీపీ, కూటమి నాయకులు బుధవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. హెచ్ఎం పోలిమాటి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకర గంగారత్నం, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, విద్యాకమిటీ నందూరి వీరభద్రరావు, సుంకర నరసింహారావు, మాదవరపు కోటేశ్వరరావు, మాధవరపు సూరిబాబు, మాధవరపు శ్రీను, మండపాక శ్రీను పాల్గొన్నారు. సుమారు 160 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించిన కిట్లను పంపిణీ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పెదపూడి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆర్ఐకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

పెదపూడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రాజేశ్వరి డిమాండ్ చేశారు. పెదపూడిలో డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నమోదు శాతం తక్కువగా ఉందనే నెపంతో మిడ్డే మీల్స్ వర్కర్స్‌ను తొలగించరాదన్నారు. ఆశా వర్కర్ల పనిభారం తగ్గించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణను ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్యాలయంలో ఆర్ఐ త్రివేణికి వినతిపత్రం అందజేశారు.

సంపూర్ణ అక్షరాస్యతతో సమాజాభివృద్ధి

– ఎమ్మెల్యే నల్లమిల్లి


అనపర్తిలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: సమాజాభివృద్ధి సంపూర్ణ అక్షరాస్యతతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి రామారెడ్డి జెడ్పీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 15,249 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఎంఈఓ-1, 2 పుష్పలత, సత్తిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల సంఘ ప్రమాణ స్వీకారం

ఇటీవల నూతనంగా ఏన్నికైన జిల్లా రైసు మిల్లర్ల సంఘ కార్యవర్గం నిబంధనల మేరకు పనిచేయాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో బుధవారం సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా కర్రి వెంకటరెడ్డి, కార్యదర్శిగా మల్లిడి రామమూర్తిరెడ్డి, ట్రెజరర్‌గా బలుసు శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా సూరవరపురెడ్డి వీర్రాజు నియమితులయ్యారు. అనంతరం ఎమ్మెల్యేను నూతన కార్యవర్గం సత్కరించింది.

మెళకువలతో నాణ్యమైన దిగుబడులు


సదస్సులో మాట్లాడుతున్న నరసింహారావు

రాజానగరం: వరి సాగులో కొద్దిపాటి మెళకువలు పాటించి, శాస్త్రీయ విధానాలను ఆచరిస్తే సాగు ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెరవలిలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు సదస్సులో వరి సాగులో మెళకువలపై అవగాహన కలిగించామన్నారు. వరిలో సాధారణ రకాలకు 36 కిలోల నత్రజని, 24 కిలోల పొటాషియం, 24 కిలోల భాస్వరం వేస్తే సరిపోతుందన్నారు. సూటి ఎరువుల రూపంలో అయితే 78 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 40 కిలోల మన్సొరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. ఎరువుల ఖర్చును తగ్గించుకుంటే భూసారాన్ని పరిరక్షించుకోవడంతో పాటు చీడపీడల ఉధృతిని కూడా తగ్గించుకోవచ్చన్నారు. అలాగే కాండం తొలుచు పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా కార్బోహైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.4 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నాట్లు వేసిన తొలినాళ్లలో వేయాల్సిన కలుపు నివారణ మందులపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ అమ్మాజీ, సార్వాలో సాగు ఖర్చులను తగ్గించుకునే విధానంపై మరో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.హైమజ్యోతి వివరించారు.

289 మందికి వైద్య సేవలు


సింగవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని సింగవరంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 289 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి పలు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు చికిత్స చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన పలు సూచనలు, సలహాలు అందించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య ఏఎన్ఎం అరుణ, ఆశావర్కర్లు విజయ, ఎ.దేవి, ఎ.స్వరాజ్యం, వి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

బిక్కవోలు: రాష్ట్ర పశు సంవర్థక శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఆరికరేవుల గ్రామంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మెళ్లూరు పశు వైద్యాధికారి డాక్టర్ గోలి వీర్రాజు బుధవారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి ఈ శిబిరం జరుగుతుందని చెప్పారు. రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు, పశువులను శిబిరానికి తీసుకురావాలని సూచించారు. పశు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేస్తారన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన


సీతానగరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

సీతానగరం: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి పి.సుబ్బలక్ష్మి, మండల అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిరసన అనంతరం తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంగన్ వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేయడానికి బడ్జెట్ పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు.

అదుపులోకి వచ్చిన డయేరియా


కాపవరంలో డయేరియా కేసులపై ఆరా తీస్తున్న రాజకుమారి

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో డయేరియా అదుపులోనే ఉందని, కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కాపవరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఎనిమిది చోట్ల నీటి నమూనాలు సేకరించి, పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించారన్నారు. అలాగే జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎన్.రాజకుమారి కాపవరంలో సర్వే చేయించారు. కొత్త కేసులు నమోదు కాలేదని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.విజయలక్ష్మి తెలిపారు. డీపీఓ రాంబాబు పర్యవేక్షణలో పారిశుధ్య చర్యలు నిర్వహించి, ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేశారు.

కడియంలో దుకాణాల పరిశీలన


కడియంలో షాపులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రాజ్ మనోజ్, సిబ్బంది

కడియం: ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ సూచించారు. వ్యాపాక దృక్పథంతోనే కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కూడా కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో, పంచాయతీ, ఆరోగ్య సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి మండల కేంద్రమైన కడియంలో పలు షాపులను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు విక్రయించే షాపుల్లో పరిశుభ్రత, నిబంధనలు పాటిస్తున్న విధానాలను పరిశీలించారు. పలు చోట్ల ఆహార పదార్థాలపై మూతలు లేకపోవడం, ఈగలు ఎక్కువగా ఉండడంతో ఆయా షాపుల యజమానులను హెచ్చరించారు. తగిన జాగ్రత్తలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని రెండు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్, ధరలు, మందుల నాణ్యత తదతర అంశాలను పరిశీలించినట్లు విజిలెన్స్, వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ డీడీ ఏ మాధవరావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, మండల వ్యవసాయాధికారి ద్వారకాదేవి పాల్గొన్నారు. తనిఖీ చేసిన రెండు షాపుల్లోనూ నిబంధనల మేరకు ఉన్నాయని వారు వివరించారు.

బోధనలో మెరుగుకు టీచ్ టూల్ దోహదం


ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు మాధవీలత

కంబాలచెరువు: బోధనా నాణ్యతను పరిశీలించేందుకు టీచ్ టూల్ కార్యక్రమం ఉపయోగపడుతుందని రాష్ట్ర పరిశీలకులు మాధవీలత అన్నారు. బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్లో తొమ్మిది రోజులుగా టీచ్ టూల్‌పై జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణను పరిశీలించిన అనంతరం మాధవీలత మాట్లాడుతూ టీచ్ టూల్ అంటే సాధారణ తరగతి గది పరిశీలనా సాధనమన్నారు. ఉపాధ్యాయులకు మెరుగైన పద్ధతులు అందించడం, బోధనను మెరుగుపరచుకోవడం, ప్రస్తుత బోధనా పద్ధతులను కొలమానం చేయడం వంటి లక్ష్యాలతో ఈ టీచ్ అనే సాధనం అభివృద్ధి చేశారన్నారు. జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో తూర్పుగోదావరి జిల్లాలోనే అధికంగా ఉపాధ్యాయులు ఉత్తీర్ణులు కావడం సంతోషమన్నారు. ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులను అభినందించారు. కోర్సు డైరెక్టర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ డివిజన్‌లోని 8 మండలాల నుంచి 104 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. విషయ నిపుణులుగా ఎస్.శ్రీనివాస్, టి.ప్రవీణ్, శిరీష, రేఖ, స్వప్న, శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీ శంకర్, సీఎంవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక చికిత్స కేంద్రం సందర్శన


మానసిక చికిత్స కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక చికిత్స కేంద్రాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు సందర్శించారు. ఈ విభాగంలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామన్నారు. మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆసుపత్రి అందిస్తున్న సదుపాయాలు, వైద్యులు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.